నేడు పలుచోట్ల విద్యుత్ అంతరాయం

ఐనవోలు/హనుమకొండ/ధర్మసాగర్, అక్టోబర్ 21 : ఐనవోలు మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా వెంకటాపురం, వనమాలకనపర్తి, రఘునాథపల్లి, మల్లక్‌పల్లి(గుంటూర్‌పల్లి) గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద మంగళవారం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేశ్ తెలిపారు. అలాగే, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు వినాయక్ నగర్, కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీ, సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డు, గెస్ట్‌హౌస్ వెనుక వైపు, ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, ఏకశిలా పార్కురోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి తెలిపారు. ధర్మసాగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మాపురం, నష్కల్, మల్లక్‌పల్లె గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్ఈ శశికాంత్ నాయక్ తెలిపారు.

24న సమగ్ర ఆదాయ ఆవశ్యకతపై విచారణ

హనుమకొండ, అక్టోబర్ 21 : నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి, టీజీఎన్పీడీసీఎల్ ప్రతిపాదించిన 5వ నియంత్రణ కాలానికి డిస్ట్రిబ్యూషన్ వ్యాపారానికి సంబంధించి సమగ్ర ఆదాయం, వీలింగ్ చార్జీలు, రిటైల్ సప్లయి వ్యాపారం, సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ చార్జీల ఆవశ్యకతపై బహిరంగ విచారణ జరుపుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న ఈ విచారణ సమావేశంలో విద్యుత్ వినియోగదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

డీఎంహెచ్‌వో ఆఫీసు మార్పు ఆలస్యం..?

హనుమకొండ, అక్టోబర్ 21 : డీఎంహెచ్‌వో ఆఫీసును హనుమకొండ ఐడీవోసీలోకి మార్చేందుకు మరింత సమయం పట్టే అవకాశాలున్నట్లు సమాచారం. అక్టోబర్ ఒకటిగా డీఎంహెచ్‌వో ఆఫీసును ఐడీవోసీలోకి మార్చాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ముఖ్యంగా ఆఫీసులో పనిచేసే కింది స్థాయి సిబ్బంది కార్యాలయాన్ని ఐడీవోసీలోకి మార్చేందుకు ఇష్టపడటం లేదనే ప్రచారం సాగుతోంది.

'స్టడీ సర్కిల్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలి'

హనుమకొండ, అక్టోబర్ 21 : బాలసముద్రంలోని ఎస్సీ సంక్షేమ బాలికల వసతి గృహం ముందు గిరిజన బాలుర స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి చిరంజీవి కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే హాస్టల్ బాలికలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నదని, వేరేచోట ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను

jobs Apply Now!

★అశోక్ మోటార్స్ కంపెనీ తరపున ప్రతీ మండలంలో పనిచేయుటకు డీలర్స్ & డిస్ట్రిబ్యూటర్స్ & BDM లు కావలెను. వెంటనే సంప్రదించగలరు. సెల్:9490320345

NTW-000

CHANGE OF NAME

★I, AKULA SRI VANI (New Name), previously called MANASA AKULA (Old Name), and R/o H.No. 8-7-62, Govindarajulagutta, Girmajipet, Warangal Mandal, Warangal Dist., TG., India, and solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- బాధితుల నుంచి అర్జీల స్వీకరణ
- గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు 106

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, అక్టోబర్ 21 : గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 106 దరఖాస్తులు రాగా, ఇందులో రెవెన్యూకు సంబంధించి 60, జీడబ్ల్యూఎంసీ 13, డీపీవో 4 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హనుమకొండలో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్ల యాజమాన్యాలు పేషెంట్ల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి చిరంజీవి కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. పేషెంట్లను డయాగ్నస్టిక్ సెంటర్లకు పంపే ఆర్ఎంపీ, పీఎంపీలకు కమీషన్లను ఇస్తూ అవినీతిపరులను తయారు చేస్తున్నారని చెప్పారు. స్కానింగ్‌కు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని, కనీసం ఫీజుల వివరాలు కూడా నోటీసు బోర్డులో చేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించిస్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మా భూమిని మాకు ఇప్పించాలి..

మడికొండ ఎస్సీ, బీసీ కాలనీ కమిటీ హాల్, పార్కుకు చెందిన సర్వే నంబర్ 1631లోని 770 గజాల భూమిని కొందరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక ఎస్సీ, బీసీ కాలనీవాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని రక్షించి కమిటీ హాల్, పార్కు నిర్మాణం చేపట్టాలని కోరారు.

బైపాస్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలి

నష్కల్–హసన్‌పర్తి బైపాస్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ కలెక్టర్‌కు స్థానిక రైతులు విన్నవించారు. రైల్వే లైన్‌తో భూములు పోతే తాము బతుకుదెరువును కోల్పోతామని పేర్కొన్నారు. అలైన్‌మెంట్ మార్చి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో హసన్‌పర్తి, ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల రైతులు ఉన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

జిల్లాలో ఓటరు జాబితా సవరణ 2024–25 సంబంధించిన స్పెషల్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్– ఖమ్మం –నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయుల స్థానానికి 2,730 దరఖాస్తులు వస్తే అన్ని పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ నమోదు దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి..

కొన్ని నెలల నుంచి పింఛన్ ఇవ్వడం లేదు. మాకు ఈ పింఛనే ఆధారం. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. సదరం సర్టిఫికెట్ గడువు దాటిపోయిందని అధికారులు చెప్పారు. మాకు వెంటనే సర్టిఫికెట్ ఇప్పించి నిలిచిపోయిన పింఛన్ మళ్లీ వచ్చేటట్లు చూడాలి.

–నల్ల మరియమ్మ, పోశాలు, ఊరుగొండ

ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయవద్దు..

చింతగట్టు శివారులోని సర్వే నంబర్‌లో 125లో ఉన్న 9గుంటల భూమిని నాకు తెలియకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేయాలి. నా ఏకైక కుమారుడు మరణించాడు. నా మనుమడు సూరం శ్రీకాంత్ నా ఆస్తులను ఇప్పటికే అమ్ముకున్నాడు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది గుంటల భూమి అమ్ముకొనేందుకు దౌర్జన్యం చేస్తున్నాడు. నాకు ఎలాంటి ఆధారం లేదు. నా ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక పోవడంతో నా చిన్న కూతురు పోటు అరుణ వద్ద ఉంటున్నా.

– సూరం లక్ష్మారెడ్డి, దేవన్నపేట, హసన్‌పర్తి మండలం

కొడుకు నుంచి రక్షణ కల్పించండి..

బాలసముద్రంలో ఉంటున్న నాకు ఆరుగురు సంతానం. ఇద్దరు కొడుకులు చనిపోయారు. మాకు హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో సౌమ్య జ్యువెలర్స్ షాపు ఉంది. మాకు అదే ఏకైక జీవనాధారం. మా పెద్ద కుమారుడు బిట్ల శ్రీనివాస్ వృద్ధాప్యంలో ఉన్న మమ్ములను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ విచక్షణారహితంగా కొడుతూ షాపు నుంచి గెంటి వేస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడు. మా షాపును లాక్కొని మాకు జీవనాధారం లేకుండా చేశాడు. మా కుమారుడితో మాకు ప్రాణహాని ఉన్నది. షాపును ఇప్పించి మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలి.

– బిట్ల శేఖర్, భాగ్యలక్ష్మి, బాలసముద్రం, హనుమకొండ

విద్యార్థులకు డైరీలు, ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, అక్టోబర్ 21 : విద్యార్థులు కష్టపడి చదువుతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు. హసన్‌పర్తిలోని జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం డైరీలు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ రజిత, నాయకులు మహేందర్‌రెడ్డి, కిరణ్, తిరుపతి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్యను చేర్చిన సఖీ నిర్వాహకులు

హనుమకొండ, అక్టోబర్ 21 : భర్త చెంతకు భార్యను చేర్చినట్లు హనుమకొండ సఖీ సెంటర్ అడ్మిన్ హైమావతి తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళ ఆంధ్రాకు చెందిన వ్యక్తిని ప్రేమించి రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నది. భర్త మేస్త్రీ పని చేస్తాడు. ఆ దంపతులకు ఒక పాప జన్మించింది. ఇటీవల భార్యాభర్తలకు గొడవ జరిగింది. ఆ రాత్రి పాపను తీసుకుని బయటకు వచ్చిన సదరు మహిళ నయీమ్‌నగర్, కిషన్‌పుర ప్రాంతంలో ఉన్నది. ఈ నెల 18వ తేదీన రెండు నెలల పాపతో మహిళ కిషన్‌పుర ప్రాంతంలో ఒంటరిగా ఉండడాన్ని స్థానికులు గమనించి 181కి ఫోన్ చేశారు. వెంటనే సఖీ సిబ్బంది పోలీసుల సహాయంతో బాధిత మహిళ, పాపను సెంటర్‌కి తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేశారు. తన కుటుంబ విషయాలు తెలుసుకొని ఆమె భర్తను సఖీ సెంటర్‌కు తీసుకువచ్చి ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మహిళ తన భర్తతో ఇష్టపూర్వకంగా వెళ్తానని అనడంతో పంపించామని హైమావతి పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పరకాల, అక్టోబర్ 21 : భార్య మద్యం తాగొద్దని మందలించినందుకు వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరకాలలో జరిగింది. పట్టణంలోని మమతనగర్ కాలనీకి చెందిన మేర్గు మధుసూదన్ బైక్ మెకానిక్‌గా పనిచేసేవాడు. దసరా నుంచి రోజు మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కూడా మద్యం తాగి రాగా, భార్య మందలించింది. దీంతో మధుసూదన్ బెడ్ రూంలోకి వెళ్లి ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలుపు పగలగొట్టి దవాఖానకు తలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. భార్య మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది మందిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, అక్టోబర్ 21 : తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భూమి పట్టా చేసుకున్న పది మందిపై కేసు నమోదైంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన సామల మల్లాచారికి ఇద్దరు కుమారులు రాజ్‌కుమార్, సతీశ్ ఉన్నారు. మల్లాచారి భార్య భారతి చనిపోవడంతో వనమాలను రెండో వివాహం చేసుకున్నాడు. మల్లాచారి ఏఆర్ ఎస్సైగా రిటైర్డ్ అయ్యాడు. అతడికి 559 అ/3లో 33గుంటలు, 558 ఆ/5లో 21గుంటల వ్యవసాయ భూమి ఉంది. కాగా, 2022 నవంబర్‌లో మల్లాచారి మరణించాడు. అనంతరం సామల సతీశ్ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రంలో వనమాల పేరు చేర్చకుండా, సోదరుడు రాజ్‌కుమార్‌కు తెలియకుండా అక్రమంగా 33 గుంటలు విరాసత్ రూపేనా పట్టా చేసుకున్నాడు. దీనిపై బాధితురాలు వనమాల కోర్టును ఆశ్రయించగా, అప్పుడు తహసీల్దార్‌గా ఉన్న శివకుమార్ నిబంధనలు పాటించకుండా కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ కేసులో అక్రమంగా పట్టా చేసుకున్న సామల సతీశ్, స్రవంతి, రేణికుంట్ల రాజు, కొత్తగట్టు రజనీకాంత్, సట్ల సతీశ్, సల్పాల సురేందర్, బత్తిని తిరుపతి, గిర్దావర్ రఫీ, తహసీల్దార్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టాలని హనుమకొండ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపారు.

భారీగా గుట్కాల పట్టివేత

ఎల్కతుర్తి, అక్టోబర్ 21 : మండల కేంద్రంలోని పాన్‌షాప్‌పై సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి భారీగా గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బస్టాండ్ కూడలిలోని తోకల శ్రీనివాస్ పాన్ టేలాలో నిషేధిత గుట్కా అమ్ముతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు చేశారు. తనిఖీల్లో సుమారు రూ. 46,050 విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎల్కతుర్తి ఏఎస్సై సయ్యద్ ఉబేదుల్లా, టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై కట్టమల్లు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు బహుమతుల ప్రదానం

లక్కీడ్రా తీస్తున్న ఆర్ఎం విజయభాను

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 21 : హనుమకొండ–హైదరాబాద్ రూట్‌లో ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులను అందజేసినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. సోమవారం హనుమకొండ బస్‌స్టేషన్‌లో డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ ఆధ్వర్యంలో లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- ఘనంగా పోలీసు అమవీరుల సంస్మరణ దినోత్సవం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ

సుబేదారి, అక్టోబర్ 21 : శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కొనియాడారు. పోలీసు అమవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కమిషనరేట్‌లోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పుష్పాగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. ప్రజల రక్షణ కోసం ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 241మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు రవి, సలీమా, రవీందర్, ఆర్ఐ స్పర్జన్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం..

రక్తదానం ప్రాణ దానంతో సమానమని సీపీ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భీమారం శుభం కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి, హనుమకొండ, కేయూసీ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, సతీశ్, రవికుమార్, ఎంజీఎం రక్తనిధి ఇన్‌చార్జి ఆశ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, అక్టోబర్ 21 : బల్దియా గ్రీవెన్స్‌లో బాధితులు అందజేసిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై పలుమార్లు గ్రీవెన్స్‌లో వినతులు ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 48వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ వేసి నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. 29వ డివిజన్ రామన్నపేటలోని ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ మోటర్ కాలిపోయి నెలలు గడుస్తోందని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 6,7,49,52 డివిజన్లలో యథేచ్ఛగా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. 1వ డివిజన్ గుండ్ల సింగారంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన పందుల షెడ్‌ను తొలగించాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ గ్రీవెన్స్‌లో 76 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 47, ఇంజినీరింగ్10, ప్రజారోగ్యం 7, పన్నుల విభాగం 8, తాగునీటి సరఫరా 4, హార్టికల్చర్‌కు 2 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాదేకర్, డీఎఫ్‌వో శంకరలింగం, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని గ్రేటర్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లోదరఖాస్తుల పురోగతిపై టీపీఎస్‌ల వారీగా ఆమె సమీక్ష చేశారు. టీపీఎస్‌లు తమ పరిధిలోని వార్డు అధికారులకు చెందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల లక్ష్యాన్ని పర్యవేక్షించాలన్నారు. వార్డు అధికారి ప్రతి రోజు 20, టీపీఎస్ పరిధిలో 120 దరఖాస్తుల పరిశీలన లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలన్నారు. టీపీఎస్‌లకు అంటెండెన్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను అమలు చేయాలని ఇన్‌చార్జీ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. చెత్త రవాణా వాహనాల మరమ్మతులు వెంటవెంటనే చేపట్టాలన్నారు. వీధి దీపాలకు మరమ్మతులు చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ధర్నా

హనుమకొండ, అక్టోబర్ 21 : నగరంలోని 4వ డివిజన్ పెద్దమ్మగడ్డ ప్రాంతంలోని జ్యోతిబస్ నగర్ ఫేస్ 1,2, రెండో డివిజన్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, కార్యవర్గ సభ్యుడు సారంపల్లి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిబస్‌నగర్ ఫేస్ 1, 2లో ఎస్సారెస్పీ కాల్వ కోసం సేకరించిన ప్రభుత్వం భూమి పోగా మిగిలిన భూమిలో భగత్ సింగ్ నగర్ కోమలకుంట చెరువులో 18 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వీరికి ప్రభుత్వం ఆధార్, రేషన్ కార్డు, కరెంటు మీటర్లు, హౌస్ హోల్డర్ పేరుతో ఇంటి నంబర్లు ఇచ్చారని, వీరు మున్సిపాలిటీకి వాటర్ ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన సర్వేలను పరిశీలించి వీరికి పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం కింద రూ.7లక్షలతో ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలతో ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నారని, దీంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండదని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. నార్త్ ఏరియా కార్యదర్శి గాదె రమేశ్, నాయకులు మంద మల్లేశం, ఇంజపల్లి రాజు, బొట్ల కుమారస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి టీచర్లకు శిక్షణ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 21 : జిల్లాలో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. ఈ శిక్షణ 22 నుంచి 25 వరకు రోజు రెండు సబ్జెక్టులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదటిరోజు తెలుగు ఉపాధ్యాయులు తేజస్వీ హైస్కూల్ ఎర్రగట్టుగుట్టలో హాజరుకావాలని, ఆంగ్ల ఉపాధ్యాయులు గ్రీన్‌వుడ్ పాఠశాల ఎర్రగట్టుగుట్ట, 23న హిందీ ఉపాధ్యాయులు తేజస్వీ హైస్కూల్ ఎర్రగట్టుగుట్ట, గణితం ఉపాధ్యాయులు గ్రీన్‌వుడ్ పాఠశాలలో, 24న జీవశాస్త్ర ఉపాధ్యాయులు తేజస్వీ హైస్కూల్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు గ్రీన్‌వుడ్, 25న ఎస్జీటీలకు తేజస్వీ హైస్కూల్, సోషల్ టీచర్లు గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో హాజరుకావాలని సూచించారు.

24న రైల్వే జీఎంతో ఎంపీల సమావేశం

కాజీపేట, అక్టోబర్ 21 : ఉమ్మడి జిల్లా ఎంపీలు ఈ నెల 24న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగే సమావేశంలో పాల్గొననున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే సమస్యలు, పెండింగ్ సమస్యలు, కొత్త– పాత ప్రాజెక్టులకు కావాల్సిన నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించనున్నారు.

సామగ్రి సరే.. మరమ్మతులకు నిధులెక్కడా?

- మూడు రోజులుగా ఎంపీడీవో ఆఫీసు పరిస్థితి ఇదీ..
- పేరు మాత్రమే రాయించిన అధికారులు

సామగ్రి మధ్య కూర్చున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

ఐనవోలు, అక్టోబర్ 21 : ఐనవోలు ఎంపీడీవో కార్యాలయ సామగ్రి సోమవారం సాయంత్రం వరకు పూర్తిగా చేరుకుంది. కంప్యూటర్లు, ప్రింటర్స్, ఎలక్ట్రానిక్ సామగ్రి మాత్రం రావాల్సి ఉంది. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం కావడంతో మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఆఫీసు మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. దీంతో గత మూడు రోజులుగా ఆఫీసు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ఎంపీడీవో కార్యాలయ అధికారులు భవనానికి పేరు మాత్రమే రాయించగలిగారు. ఉన్నతాధికారులు భవనం మరమ్మతులకు నిధుల మంజూరు చేసి ఆఫీసు నిర్వహణ సాగేలా తోడ్పటు అందించాలని మండల వాసులు కోరుతున్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత జట్టుతో ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీలు

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 21 : యూనిర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ముగిశ